# సమష్టి కృషితోనే అభివృద్ధి

- నీటి పొదుపు ఎంతో అవసరం
- మూడు గ్రామాలకు సాగు, తాగు నీరు
- పెప్సీకో నిర్వాహణ అద్భుతం
- చెర్యాల్ పాఠశాల ప్రహరీకి కృషి
- కలెక్టర్ దినకర్ బాబు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ దినకర్ బాబు



టైలరింగ్‌లో ట్రైనింగ్ చేస్తున్న మహిళలు

**సంగారెడ్డి, డిసెంబర్ 5 (కెఎన్ఎన్ ప్రతినిధి):** పల్లెలు అభివృద్ధి చెందాలంటే అందరూ కలిసి కట్టుగా ఉండి సమిష్టిగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్ దినకర్ బాబు అన్నారు. బుధవారం మండల పరిధిలోని చెర్యాల్‌లో పెప్సీకో ఇండియా మేనేజ్‌మెంట్ మరియు కమ్యూనిటీ సభ్యుల సమక్షంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 400 మిలియన్ లీటర్ల నీటిని ఆదా చేసే కమ్యూనిటీ వాటర్ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల పరిధిలోని చెర్యాల్, కాశీపూర్, కొల్లాపూర్ గ్రామాలను పెప్సీ కంపెనీ వారు దత్తత తీసుకొని అభివృద్ధి చేశారని తెలిపారు. ఇందులో మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ఉచితంగా టైలరింగ్, నీటి పొదుపు చేసేందుకు ఇంకుడు గుంతను కట్టి దాదాపు 7500మంది జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. ఈ రోజుల్లో మనిషికి గాలి, ఎంతో అవసరమో నీరు కూడా అంతే అవసరమని దీని కోసం ప్రతి ఒక్కరు నీటి పొదుపు చేసే అవసరం ఎంతైన ఉందన్నారు. పెప్సీ పరిశ్రమకు దత్తత ఇచ్చినందుకు అభివృద్ధి సాధించాలని అదే విధంగా అందరూ కూడా వారికి సహకరించి అభివృద్ధి సాధించుకోవాలన్నారు. అభివృద్ధి వైపు చూడకుండా దత్తత తీసుకున్న పెప్సీ పరిశ్రమలపై అభాండాలు వేయరాదని సూచించారు. వీరు చేసిన ఈ ప్రాజెక్ట్ ద్వారా కాశీపూర్, చెర్యాల్, కొల్లాపూర్ గ్రామాలకు తాగునీరు, సాగు నీరు కొదువ




కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినకర్ బాబు



హాజరైన గ్రామస్తులు, అధికారులు

లేదని పేర్కొన్నారు. అంతేకాకుండా రాబోయే రోజుల్లో కూడా మరికొన్ని గ్రామాలను దత్తత తీసుకొని అభివృద్ధి పర్చాలన్నారు. ఇప్పటి వరకు నిర్వహించిన పనులు ఆయా గ్రామాలకు ఉపయోగ పడేలా ఉన్నాయని ముందు కూడా మరికొన్ని గ్రామాలను దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తూ తమ సత్తాను చాటుకోవాలన్నారు. ఈ మూడు గ్రామాలను దత్తత తీసుకొని అభివృద్ధి పర్చిన పెప్సీ పరిశ్రమకు కలెక్టర్ కితాబిచ్చారు. సాగునీటి కోసం వర్షంపు నీటి ఇంకుడు గుంతలు, స్వయం సహాయక బృందాల ద్వారా విలువల ఆధారిత మద్దతు నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవడం, ఆదాయం సృష్టించడం అనే రెండు లక్ష్యాలతో ఈ ప్రాజెక్ట్‌ను రూపొందించారన్నారు. గ్రౌండ్ వాటర్ రిచార్జ్ ప్రాజెక్ట్‌కు సాలీనా 400మిలియన్ లీటర్ల నీటిని నిల్వ చేసే సామర్థ్యం ఉందన్నారు. వర్షాలు లేని కాలంలో కూడా నీటి లభ్యత ఉండడం వల్ల రైతులు ఇప్పుడు అధనం పంటలు వేయడంతో పాటు ఎకరాకు దాదాపు రూ.15వేలు అదనంగా సంపాదించగలుగుతున్నారన్నారు. చెర్యాల్ గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ తమ పాఠశాలలో ఇంగ్లీషు మీడియం తెలుగు మీడియం రెండు ఉన్నాయని, దీంతో పాటు ఉర్దులో కూడా విద్యార్థులు బాగా రాణిస్తున్నారని వీరికి తరగతి గదులతో ఉపాధ్యాయులు కూడా సక్రమంగానే ఉన్నారని, పాఠశాలకు ప్రహరి గోడ వాల్ లేక పోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కలెక్టర్ చొరవ తీసుకొని ప్రహరిగోడను నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో పెప్సీ కంపెనీ చైర్మెన్ మను ఆనంద్, భారతి, మాజీ సర్పంచ్ రాములు, రైతులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన గావించికార్యక్రమంలో ప్రసంగించారు. అనంతరం విద్యార్థులు గణేశ్, స్తుతితో గీతాన్ని ఆలపించారు.